మ్యూజియం ఆవరణలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, సిద్దిపేట జిల్లా అదనపు జిల్లా జడ్జి మిలాన్ కాంబ్లే

చూడదగిన పర్యాటక ప్రాంతం సాగర్ : సబ్ కలెక్టర్

నందికొండ, డిసెంబర్ 29 : నాగార్జునసాగర్ చూడదగిన పర్యాటక ప్రాంతమని మిర్యాలగూడ డివిజన్ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, సిద్దిపేట జిల్లా అదనపు జడ్జి మిలాన్ కాంబ్లే అన్నారు. ఆదివారం వారు సాగర్‌లోని బుద్ధవనం, నాగార్జునకొండ, డ్యామ్‌ను కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు.

బడుగుల ఆశా జ్యోతి రాగ్యానాయక్ : ఎమ్మెల్యే బీఎల్ఆర్

బస్టాండ్ వద్ద గల రాగ్యానాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 29 : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రాగ్యానాయక్ అని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. రాగ్యానాయక్ 23వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి, బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి ఎమ్మె ల్యే నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

మిర్యాలగూడ : పద్మశాలీల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కుండల బజార్‌లో గల మార్కెండేయ ఫంక్షన్‌హాల్‌లో పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, సంఘం కన్వీనర్ బావండ్ల పాండు, రామాప్రసాద్, మిర్యాల కృష్ణయ్య, యర్రమాద రాములు, రాపోలు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చిలుకూరు సక్కుబాయి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వీరేశానికి వినతి

ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

చిట్యాల, డిసెంబర్ 29 : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాల మున్సిపల్ కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి చిట్యాలలో వినతిపత్రం అందించారు. కనీస వేతనం రూ. 26వేలకు పెంచి, కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్, సంఘం అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు జడల నర్సింహ, పాల లక్ష్మయ్య, బాకి అండాలు, మేడి శేఖర్, నల్ల శంకర్, మేడి శోభ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర : ఎమ్మెల్యే

నకిరేకల్ : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు బానాల రాంరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రాంరెడ్డి దంపతులను మెమెంటో, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, ఎంఈఓ మేక నాగయ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూజర్ల శంభయ్య, ఐఎంఏ పట్టణాధ్యక్షుడు రాపోలు రఘునందన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

హాలియా, డిసెంబర్ 29 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి కోరారు. హాలియాలో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, అధికారులతో గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. హాలియా మున్సిపాలిటీలో సర్వే నంబర్ 48లో ఉన్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చి, డ్రైనేజీ, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. జమిలి ఎన్నికల పేరుతో మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించే విధంగా కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బీఆర్ అంబేద్కర్‌ను కించ పరుస్తూ మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆయన వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, అవుతా సైదులు, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రేబెల్లి వెంకటేశ్వర్లు, పొదిల వెంకన్న, కారంపూడి ధనమ్మ, కోరె రమేశ్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం

మునుగోడు, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 63 సంవత్సరాల క్రితం (1960-2023) విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు త్వరలో నిర్వహించబోయే మహా ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ హోదాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు మరమ్మతులు పూర్తి చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

అర్బన్ కాలనీలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబర్ 29 : పట్టణంలో కలెక్టరేట్ వెనుక గల అర్బన్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు చిన్న చిన్న మరమ్మతులన్నింటినీ జనవరి-15 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర పనులు కూడా పూర్తి చేయాలన్నారు. కాలనీలో ఉన్న 550 ఇండ్లు జీ ప్లస్ టూ మోడల్‌లో నిర్మించిన నేపథ్యంలో బ్లాకుల వారీగా ఉన్న చిన్న డ్యామేజీలను కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, పీఆర్ఈఈ తిరుపతయ్య ఉన్నారు.

వికారంగా 'ఆకారం'!

ఆకారం గ్రామంలో రోడ్డు వెంట పడేసిన చెత్త

శాలిగౌరారం, డిసెంబర్ 29 : పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని ప్రభుత్వాలు చెబుతున్నా.. గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని ఆకారం గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శాలిగౌరారం నుంచి ఆకారం మీదుగా నల్లగొండకు వెళ్లే ప్రధాన రహదారి వెంట చెత్తను వేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. వర్షం వస్తే దుర్వాసన వెదజల్లి కాలనీ వాసులతో పాటు ఆ రోడ్డు మీదుగా వెళ్లేవాళ్లు కూడా ముక్కు మూసుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు అంటున్నారు. అదే విధంగా గ్రామానికి చెత్త ట్రాక్టర్ రాక చాలా రోజులే అవుతుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హామీ ప్రకారం పింఛన్ పెంచాలి : వెంకటాచారి

పెంచిన పింఛన్ ఇవ్వాలని నినాదాలు చేస్తున్న దివ్యాంగులు

చందంపేట(దేవరకొండ), డిసెంబర్ 29 : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను వెంటనే పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సభ్యుడు శ్రీరామదాసు వెంకటాచారి డిమాండ్ చేశారు. దేవరకొండ పట్టణంలోనీ ఐబీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. పింఛన్ పెంచని క్రమంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు గుద్దేటి సైదులు, పచ్చిపాల కృష్ణయ్య, రవీందర్‌నాయక్, మేఘావత్ భాస్కర్, పార్వతి, కిషన్ లాల్, నేతాల అంజయ్య, మధ్యనాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి : వేణూధర్‌రెడ్డి

కొండమల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వేణూధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, డిసెంబర్ 29 : కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణూధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతిరోజు ధాన్యం వివరాలను నమోదు చేసి, లారీల్లో లోడ్ చేసి వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. అయన వెంట సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించాలి : శ్రీనివాస్‌యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

మాడ్గులపల్లి, డిసెంబర్ 29 : సూర్యాపేట జిల్లాలో జరిగే దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు ప్రభుత్వం నిధులు కేటాయించి భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ పెద్దగట్టు జాతరకు లక్ష ల్లో భక్తులు హాజరవుతారని, జాతర దగ్గర పడుతున్నందున ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించాలని కోరారు. కార్యక్రమంలో ఊరిబండి సైదు లు, తగుళ్ల వెంకన్న, కొమ్ము నాగయ్య, నాగరాజు, శివయాదవ్, అశోక్, కునుకుంట్ల వెంకన్న, లింగయ్య, కొండయ్య, వెంకన్న, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

మాడ్గులపల్లి, డిసెంబర్ 29 : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో గల లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీనరసింహాస్వామి ఆలయ తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ఆలయంలోని 4 జతల బంగారు పుస్తెలు, 5తులాల నాలుగు జతల వెండి కాళ్ల ఉంగరాలు(మెట్టెలు), మైక్ సెట్, రూ.3వేల నగదును చోరీ చేశారు. ఆలయ పూజారి తిరుమల జగన్మోహనాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు నల్లగొండ నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు.

10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని మంత్రికి వినతి

మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 29 : ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా 10 ఏకరాల వరకు రైతు భరోసా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రావుతో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. టెస్కాబ్ కార్యాలయంలో జరిగిన డీసీసీబీ చైర్మన్ల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరు కాగా అయనకు రైతు భరోసాపై వినతి పత్రం ఇచ్చి ఈ సీజన్ నుంచి అమలు చేయాలని కోరారు. పంట సాగు, ఇతర లింకులు పెట్టకుండా ప్రతి రైతుకు భరోసా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీటీ రోడ్డు నిర్మించాలి : సైదులు

నార్కట్‌పల్లి డిసెంబర్ 29 : మోత్కూరు రోడ్డు నుంచి హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65ను అనుసంధానిస్తూ పోతినేనిపల్లి, ఏపీ లింగోటం మీదుగా బీటీ రోడ్డు మంజూరు చేయాలని అక్షర వెలుగు సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు భీంపాక సైదులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల మధ్య గ్రానైట్, స్టోన్ క్రషర్ మిషన్లు ఉండడం వల్ల నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయన్నారు. ఈ వాహనాలు గ్రామాల మధ్యలో నుంచి వెళ్లడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనాల కాలుష్యం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, బీటీ రోడ్డు నిర్మిస్తే లారీలు గ్రామాల మధ్య నుంచి కాకుండా నేరుగా జాతీయ రహదారికి చేరుకుంటాయని తెలిపారు. సమస్యలను అర్థం చేసుకొని బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆరుబయట మద్యం సేవిస్తే కఠిన చర్యలు

● ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, డిసెంబర్ 29 : డిసెంబర్ 31, న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి పోలీసులు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తారని, పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేస్తారని హెచ్చరించారు. వేడుకలను ప్రమాదాలకు దూరంగా, పోలీసుల సూచనలు పాటిస్తూ, ఇతరుల మనోభావాలు దెబ్బతీయకుండా జరుపుకోవాలని సూచించారు. వైన్స్ రాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్స్ 1 గంట వరకు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో దుకాణాదారులు సమయపాలన పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేస్తామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలు సేవించే వారిపై ఎప్పటికప్పుడు డ్రగ్ టెస్టింగ్ కిట్ల ద్వార తనిఖీలు చేస్తామని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపరాదని తెలిపారు. మఫ్టీ టీమ్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో అక్రమ సిట్టింగ్‌లు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులుగా తిరుగడం వంటి వాటిపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. అర్కెస్ట్రా, డీజేలు, మైక్‌లు ఉపయోగించడం, పటాకులు కాల్చడం నిషేధమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి : ఎస్ఐ శేఖర్

అడవిదేవులపల్లి : న్యూ ఇయర్ వేడుకల్లో మండల ప్రజలు నిబంధనలను పాటించాలని ఎస్ఐ వి.శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీజే అనుమతి లేదని, అక్రమంగా డీజే పెడితే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ఉంటాయని, అదేవిధంగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో టాప్ మీద వ్యవసాయ కూలీలను ఎక్కించుకొని వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రులకు విజ్ఞప్తి : ఎస్ఐ రవీందర్

కట్టంగూర్ : నూతన సంవత్సరం రోజున ఏ కుటుంబం విషాదకర ఘటనతో ప్రారంభం కాకుండా తమ పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. న్యూ ఇయర్ వేడుకల పేరుతో తోటి పౌరులకు అసౌకర్యం కలిగే విధంగా ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమయుక్త వయసు పిల్లలకు, మరీ ముఖ్యంగా మైనర్ పిల్లలకు, బైకులు, కార్లు ఇస్తే వారు ఆ వాహనాలను మద్యం మత్తులో వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి సాధ్యమైనంత వరకు పిల్లలను కట్టడి చేయాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

రెడ్డి హాస్టల్ అల్యూమిని చైర్మన్‌గా మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 29 : జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల రాజ బహదూర్ వెంకటరామ్‌రెడ్డి (రెడ్డి)హాస్టల్ అల్యూమిని(పూర్వ విద్యార్థుల) చైర్మన్‌గా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం ఎన్నుకున్నారు. తన ఎన్నిక పట్ల మంత్రి కోమటిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ రెడ్డి హాస్టల్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్‌కు ఎకరం భూమి అవసరం ఉన్నందున త్వరలోనే ప్రభుత్వంతో చర్చించి కేటాయించటంతో పాటు అందు లో భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అక్కడ అన్ని కులాలకు చెందిన వారు చదువుకుంటున్నారని, ఈ హాస్టల్‌ను అభివృద్ధి చేస్తే మరింత మందికి ఉపయోగపడే అవకాశం ఉందన్నారు.

నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, డిసెంబర్ 29 : పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మిర్యాలగూడ రోడ్డు, మాన్యంచెల్క, ప్రకాశంబజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

దర్వేశిపురం ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి నేడు వేలం

నల్లగొండ సిటీ, డిసెంబర్ 29 : కనగల్ మండలం దర్వేశిపురంలో గల రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించడానికి గాను నేడు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద టెండర్ కమ్ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొన దలచిన వారు నిర్దేశించిన టెండర్ డీడీ చెల్లించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుర్రంపోడ్, డిసెంబర్ 29 : మండలంలోని కొప్పోలు గ్రామంలో శనివారం రాత్రి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దేవసారి రమేశ్(30)-మంగమ్మ భార్యభర్తలు. ఈ నెల 24న రాత్రి భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్ ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే నల్లగొండ ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నల్లగొండ క్లబ్ సేవలు ప్రశంసనీయం : బుర్రి

నల్లగొండ/నల్లగొండ రూరల్, డిసెంబర్ 29 : పట్టణంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ క్లబ్‌గా నిలబడుతూ సేవల్లో ముందుంటున్న నల్లగొండ క్లబ్ సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ క్లబ్ సహకారంతో ఆవరణలో మెగా రక్త దానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 100వ సారి రక్తదానం చేసిన కొప్పుల ఈశ్వర్‌తో పాటు 105 మంది డోనర్లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులున్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

నీలగిరి, డిసెంబర్ 29 : మండల పరిధిలోని అప్పాజిపేట గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎర్రబోతు యాదగిరిరెడ్డి, ఎలైట్ అధ్యక్షుడు తుమ్మల గోవింద్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రేపాల మదన్‌మోహన్ సహకారంతో స్కూల్ విద్యార్థులకు యూత్ ఎంపవర్‌మెంట్ స్పోర్ట్స్ కిట్‌ను అందించారు. మాజీ ఎంపీటీసీ సైదులు, వైద్యుడు డా.సందీప్‌రెడ్డి, సతీశ్‌కుమార్ ఉన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

హాలియా, డిసెంబర్ 29 : పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో ఆదివారం డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అన్ని రకాల ఆరోగ్యం పరీక్షలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి సుమారు 150 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల పరామర్శ

విమలమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 29 : జిల్లా కేంద్రంలోని 39వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బోడ వేమనరావు తల్లి విమలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం వేమనరావు నివాసంలో విమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బక్క పిచ్చయ్య, మెరుగు గోపినాథ్, రంజిత్, కౌకుంట్ల వీరాచారి, జాఫర్, మహేందర్‌రెడ్డి, గణేశ్ ఉన్నారు.

యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ కొలను శివరాంరెడ్డి

నీలగిరిలో ఆపరేషన్ చబుత్ర

- 154 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 88బైకులు, 15ఆటోలు, 6 కార్లు, 78 సెల్‌ఫోన్లు స్వాధీనం
- 54 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నీలగిరి, డిసెంబర్ 29 : డిసెంబర్ 31 వేడుకల నేపథ్యంలో నల్లగొండ పట్టణంలో శనివారం అర్ధరాత్రి డీఎస్పీ కొలను శివరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆపరేషన్ చబుత్ర, నాకాబందీ నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి అదివారం తెల్లవారు జాము 4 గంటల వరకు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇద్దరు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 98 మంది కానిస్టేబుల్స్‌లతో 13 చెకింగ్ బృందాలు, మరో పది పెట్రోలింగ్ బృందాలుగా ఏర్పడి అర్ధరాత్రి పట్టణాన్ని అష్ట దిగ్బంధం చేశారు. ఈ సందర్భంగా రోడ్లపై అవారాగా తిరుగుతూ, అనుమానాస్పదంగా ఉన్న 154 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి వద్ద నుంచి 88 బైకులు, 6 కార్లు, 15 ఆటోలు, 78 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 54 మందిపై డ్రంక్